క్లుప్తంగా

పాలకవీడు ఎంపీడీఓగా లక్ష్మి బాధ్యతల స్వీకరణ



ఎంపీడీఓ లక్ష్మిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, సిబ్బంది

పాలకవీడు : పాలకవీడు ఎంపీడీఓగా జి.లక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ భూక్యా గోపాల్, జెడ్పీటీసీ మాళోతు బుజ్జి మోతీలాల్, కార్యాలయ సిబ్బంది ఆమెకు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ లక్ష్మి మాట్లాడుతూ మండల సమగ్ర అభివృద్ధిపై దృష్టి సారిస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ దయాకర్, డెక్కన్ పరిశ్రమ సీజీఎం నాగమల్లేశ్వరరావు, ఏపీఓ రాజు, టైపిస్ట్ పిచ్చయ్య సిబ్బంది పాల్గొన్నారు.

మునగాల సీఐగా రామకృష్ణారెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ రామకృష్ణారెడ్డి

మునగాల : మునగాల పోలీస్ సర్కిల్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా డి.రామకృష్ణారెడ్డి గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. కోదాడరూరల్ నుంచి ఆయన బదిలీపై మునగాల సీఐగా వచ్చారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేసిన పి.వీరరాఘవులు సూర్యాపేట సీసీఎస్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తానన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ ముత్తయ్య

హుజూర్‌నగర్ : విద్యార్థులు సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ ముత్తయ్య సూచించారు.గురువారం హుజూర్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో మహిళల భద్రత, రక్షణ, సైబర్ నేరాలు తదితర అంశాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లాలో షీ టీమ్స్ బృందాలు, మహిళల భద్రత, రక్షణ, 100 కాల్, సోషల్ మీడియా, ఓటీపీ ఫ్రాడ్స్, సైబర్ నేరాలు, టోల్ ఫ్రీ నంబర్ 1930, సెల్‌ఫోన్ వలన కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు. మహిళలు, విద్యార్థినులు ఈవ్‌టీజింగ్‌కు గురైతే షీటీం వెంటనే స్పందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ బలరాం రెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపవాస దీక్ష ప్రారంభం



కోదాడ బాప్టిస్ట్ చర్చిలో ఉపవాస దీక్షలో పాల్గొన్న క్రైస్తవులు

కోదాడఅర్బన్ : క్రైస్తవుల పవిత్ర పండుగ అయిన గుడ్ ఫ్రైడేకు ముందు 40 రోజుల పాటు పాటించే ఉపవాస దీక్షను కోదాడలోని నయానగర్‌లో గల బాప్టిస్ట్ చర్చిలో గురువారం చర్చి పాస్టర్ వి.యేసయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఉపవాస దీక్ష రోజుల్లో క్రైస్తవులు ఎంతో భక్తి శ్రద్ధలతో దేవుని ఆరాదిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ క్రిస్టియన్ మైనార్టీ సభ్యురాలు వంటపాక జానకియేసయ్య, కోటయ్య, జగ్గు నాయక్, జాన్, తబిత, కల్యాణ్, మోజెస్, గురునాథ్, రాంబాబు, మెరీనారాణి, మౌనిక, జ్యోతి, సువార్తమ్మ, సలోమి పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

కోదాడరూరల్ : కోదాడ మండల పరిధిలోని కూచిపూడితండాలో గల అయ్యప్పస్వామి ఆలయ మూడవ వార్షికోత్సవాన్ని భాదావత్ రవి గురుస్వామి ఆధ్వర్యంలో గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, అష్టోత్తర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తండాలో అయ్యప్పస్వామి ఆలయం నిర్మించడం అభినందనీయమని అయ్యప్ప సన్నిదాన కమిటీ చైర్మన్, కోదాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గాలి శ్రీనివాసునాయుడు అన్నారు. అనంతరం 1500 మంది భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గాయకుడు భాస్కర్, ఎక్సైజ్ సీఐ భాదావత్ గాంధీ, నందలాల్, అయ్యప్ప భక్తులు ఉన్నారు.

ఘనంగా శ్రీసంత్ సేవాలాల్ జయంతి



హుజూర్‌నగర్: సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గిరిజన నాయకులు



పాలకవీడు : చెరువుతండాలో సేవాలాల్ ఆలయంలో పూజలు చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కోదాడ : గిరిజనులు విద్య, సామాజికంగా అభివృద్ధి సాధించినప్పుడే సంత్ సేవాలాల్‌కు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ అన్నారు. గురువారం కోదాడలో నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. గిరిజనుల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన ధన్య జీవి సేవాలాల్ అని కొనియాడారు. గిరిజనులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా గిరిజన ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, ఎంపీపీ మల్లెల రాణి, జెడ్పీటీసీ కృష్ణకుమారి, ఎంఈఓ సలీంషరీఫ్, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, వంగవేటి రామారావు, సైదానాయక్, హజీనాయక్, లచ్చిరాంనాయక్, డాక్టర్ దశరథనాయక్, రవినాయక్, జగ్గునాయక్ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలతండాలో..

మఠంపల్లి : మండలంలోని తుమ్మలతండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



కోదాడ : సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సూర్యనారాయణ

అదేవిధంగా తుమ్మలతండా, యాతవాకిళ్ల, అవిరేనికుంటతండా, బాడవతండా, తదితర గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల అభివృద్ధి పనులకు తీర్మానాలు ఆమోదించారు. కార్యక్రమంలో కార్యదర్శులు నరేష్, విజయక్రాంతి, నాగిరెడ్డి గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

బంజారా భవన్‌లో..

హుజూర్‌నగర్ : పట్టణంలోని బంజారా భవన్‌లో గురువారం గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి, భోగ్ బండారో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పూజారి బానోతు నాగేశ్వరరావు, గిరిజన నాయకులు



మఠంపల్లి : సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు తదితరులు

మాలోతు నాగు, భూక్యా కోటియా, సైదానాయక్, చత్రునాయక్, పార్వతి కొండనాయక్, జగన్ నాయక్, వెంకట్రామ్, సుజాత సక్రు, మధు, శ్రీను, తులసిరామ్, నాగు, డాక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

చెరువుతండా గ్రామంలో..

పాలకవీడు : మండలంలోని చెరువుతండా గ్రామంలో గురువారం బంజారాల ఆరాధ్య దైవం సద్గురు సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ ఆలయంలో ఎంపీపీ భూక్యా గోపాల్, జెడ్పీటీసీ మాళోతు బుజ్జి మోతీలాల్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ లక్ష్మీనర్సయ్య, డెక్కన్ సిమెంట్ పరిశ్రమ సీజీఎం నాగమల్లేశ్వరరావు, సైదానాయక్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మొదటి ప్రయత్నంలోనే మూడు కొలువులు

- డీఎల్, జేఎల్, స్కూల్ లైబ్రేరియన్ ఉద్యోగాలు సాధించిన మమత

మోతె : గురుకుల బోర్డు మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో మోతె మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన బోడపట్ల మమత మొదటి ప్రయత్నంలోనే మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి సత్తా చాటింది. లైబ్రరీ సైన్స్ విభాగంలో డీఎల్, జేఎల్, స్కూల్ లైబ్రేరియన్ కొలువులు సాధించి ఆదర్శంగా నిలిచింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ మమతను అభినందించారు. కాగా, మమత బీటెక్ పూర్తి చేసిన తర్వాత 2015లో వివాహం చేసుకుంది. తన ఇద్దరు బాబులను చూసుకుంటూనే రెండు సంవత్సరాలు ఉద్యోగానికి సన్నద్ధమై లక్ష్యం సాధించింది. మమత దూరవిద్యలో బీఎల్ఐసీ, ఎంఎల్ఐసీ(కేయూ)లో పూర్తి చేసింది. కాగా, గురువారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో గురుకుల నియామకాల ఉన్నతాధికారుల చేతుల మీదుగా డీఎల్ ఉద్యోగానికి నియామకపత్రం అందుకుంది.



అధికారి నుంచి డీఎల్ ఉద్యోగ నియామకపత్రం అందుకుంటున్న మమత

కుటుంబసభ్యుల ప్రోత్సాహంతోనే ఉద్యోగాలు సాధించాను

నా కుటుంబసభ్యుల ప్రోత్సాహంతోనే మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించగలిగాను. ఎంఈఓ కార్యాలయంలో సీఆర్‌పీగా ఉద్యోగం చేస్తున్న నా భర్త నన్ను పోటీ పరీక్షలకు సిద్ధం చేయించారు. నా కుటుంబ సభ్యులు కూడా నాకు ఎంతో సహకరించారు. – బోడపట్ల మమత

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన యరగాని నాగన్న



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న యరగాని నాగన్న, భాస్కర్‌రెడ్డి

హుజూర్‌నగర్ : తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న గురువారం అసెంబ్లీ ఆవరణలోని సీఎం ఛాంబర్‌లో కలిసారు. ఈ సందర్భంగా సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట ఐఎన్‌టీయూసీ నాయకులు వి.భాస్కర్ రెడ్డి, ఆర్‌డీ చంద్రోశఖర్ తదితరులు ఉన్నారు.

ఫిజికల్ డైరెక్టర్ నియామకపత్రం ప్రదానం



సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం అందుకుటుంటున్న శోభన్‌బాబు

మునగాల : ఇటీవల ప్రకటించిన గురుకుల కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఫలితాల్లో మండలంలోని తాడువాయి గ్రామానికి చెందిన జిల్లేపల్లి శోభన్‌బాబు జనరల్ కేటగిరిలో రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంకు సాధించి ఉద్యోగం సాధించాడు. దీంతో గురువారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ.స్టేడియంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నాడు. దీంతో శోభన్‌బాబు కుటుంబసభ్యులతో పాటు పలువురు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

దోరకుంటలో తాగునీటికి కటకట



దోరకుంట శివారులో వ్యవసాయ బోరు వద్ద నుంచి ఆటోలో నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్తులు

కోదాడరూరల్ : మండలంలో మేజర్ గ్రామ పంచాయతీల్లో ఒకటైన దోరకుంటలో వేసవికాలం ప్రారంభంలోనే నీటి ఎద్దడి ప్రారంభమైంది. భూగర్భజలాలు పడిపోవడంతో బోర్లలో మోటార్లకు నీరందని పరిస్థితి నెలకొంది. దీంతో పలు వార్డుల్లో నీటికోసం ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని కిందివైపు కాలనీల ప్రజలకు నీరు అడపదడప అందుతుండగా ఎగువన ఉన్న నెమలిపురికాలనీ రోడ్డు పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు నీరు రావడం లేదు. దీంతో గ్రామస్తులు సమీపంలో ఉన్న వ్యవసాయ బావులు, బోర్ల వద్ద నుంచి ట్రాక్టర్లు, ఆటోల సహాయంతో డ్రమ్ముల్లో నీటిని తీసుకొచ్చి ఇంటి వద్ద సంపుల్లో నింపుకొని అవసరాలు తీర్చుకుంటున్నారు. అయితే గ్రామంలో ఎక్కువ వ్యవసాయ కుటుంబాలు ఉన్నాయని అంతేకాకుండా తమకు గేదెలు, జీవాలు ఉన్నాయని వాటికి నీటి అవసరం ఎక్కువగా ఉంటుందని అధికారులు వెంటనే స్పందించి గ్రామంలో నూతన బోర్లు వేసి నీటి సమస్యను పరిష్కరించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలి

చిలుకూరు : గ్రామ సమస్యల పరిష్కారంలో ప్రజలు భాగస్వాములు కావాలని మాజీ ఎంపీపీ, స్వాతంత్ర్య సమరయోధుడు దొడ్డా నారాయణరావు అన్నారు. గురువారం చిలుకూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. గ్రామంలో ప్రధానంగా తాగునీటి సమస్య లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి షరీఫ్‌వుద్దీన్, బిల్ కలెక్టర్ ధర్మయ్య, అంగన్‌వాడీ టీచర్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పలువురికి సన్మానం



నేరేడుచర్ల : మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్ పర్సన్‌ను సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



హుజూర్‌నగర్ : సీఐ చరమందరాజును సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నేరేడుచర్ల : నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, వైస్ చైర్ పర్సన్ అలక సరితను గురువారం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో పలువురు నాయకులు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శులు ఎల్లబోయిన సింహాద్రి, ముక్క జానయ్య, కత్తి శ్రీనివాస్‌రెడ్డి, రావుల సత్యం, ఎ.లక్ష్మి, చిలకరాజు శ్రీను ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో...

మున్సిపల్ చైర్మన్ ప్రకాశ్, వైస్ చైర్‌పర్సన్ సరితలను పురపాలక సంఘం కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మార్పీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యడవల్లి అరుణ్ మాదిగ, మీసాల సురేష్ మాదిగ, ఉబ్బపల్లి సైదులు, వెంకన్న, పల్లె సల్మాన్‌రాజు, కాంతయ్య తదితరులు ఉన్నారు.

సీఐ చరమందరాజుకు సన్మానం

హుజూర్‌నగర్ : ఇటీవల బాధ్యతలు స్వీకరించిన హుజూర్‌నగర్ సీఐ జి.చరమందరాజు, ఎస్‌ఐ ముత్తయ్యలను గురువారం వివిధ పార్టీల నాయకులు వారి కార్యాలయాల్లో వేర్వేరుగా శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సన్మానించిన వారిలో కాంగ్రెస్ నాయకులు మధిర ప్రతాపరెడ్డి, దాసా నాగేశ్వరరావు, నలబోలు వెంకటరెడ్డి, రాంరెడ్డి, బీజేపీ, వివిధ సంఘాల నాయకులు ఉన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు..

నేరేడుచర్ల : బదిలీపై వెళ్లిన నేరేడుచర్ల మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్లును గురువారం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శులు సింహాద్రీ, జానయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సత్యం, లక్ష్మి, చిలకరాజు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ రవీందర్‌నాయక్‌కు..

నేరేడుచర్ల : నేరేడుచర్ల ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన రవీందర్‌నాయక్‌ను గురువారం నేరేడుచర్ల జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య, కాంగ్రెస్ నాయకులు జ్యోతిబాబు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఏఎస్ఐకి..

చిలుకూరు : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పని చేసి కోదాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లిన పులి వెంకటేశ్వర్లును గురువారం చిలుకూరులోని జేజేనగర్ కాలనీలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొలిశెట్టి నాగేంద్రబాబు, ఎంపీటీసీ నెమ్మాది సైదాబాబు, నాయకులు బండ్ల కోటయ్య, వట్టికూటి నాగయ్య, వడ్డేపల్లి కోటేష్, ఆనందరావు, సూరిబాబు, రామకృష్ణ, శ్రీను, వీరబాబు, రమణ, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు పెద్దపీట

- రూ. 24.17 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం



మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో వేసవి కాలంలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు పారిశుద్ధ్య మెరుగుకు పెద్దపీట వేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్ తెలిపారు. గురువారం నేరేడుచర్ల మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ కమిషనర్ నీలికొండ వెంకటేశ్వర్లు అధ్యక్షతన మున్సిపల్ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2024- 25 ఆర్థిక సంవత్సరానికి గాను 24 కోట్ల 17 లక్షల 90 వేల రూపాయల బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. సాధారణ పరిపాలన సిబ్బంది జీత భత్యాల కేటాయింపుతో పాటు ఇంజనీరింగ్, నీటి సరఫరా, పారిశుద్ధ్య కార్మికులకు రూ. 20.10 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా గ్రీన్ బడ్జెట్ కింద 49 లక్షలు, సాధారణ పరిపాలన సిబ్బంది జీత భత్యాలకు కోటి 35 లక్షల 80 వేల రూపాయలను ఖర్చు చేసేందుకు అంచనా బడ్జెట్ రూపొందించామన్నారు. మున్సిపాలిటీకి సాధారణ ఆదాయం 1.58 కోట్లు, మార్కెట్ అగ్రిమెంట్ ఫీజు, కులాయిలు, లైసెన్స్‌ల ద్వారా 31 లక్షల 10 వేల రూపాయలు, ఇతర ఆదాయం ద్వారా 19 కోట్ల 98 లక్షల రూపాయల ఆదాయం లభించనున్నదని తెలిపారు. ముందుగా జూనియర్ అసిస్టెంట్ శారద ఆదాయ నివేదికను చదివి వినిపించారు. మిషన్ భగీరథ పైపులైన్ ద్వారా పట్టణంలో తాగునీటి ట్యాంకులను నింపించి ప్రజలకు నీటి సమస్య రాకుండా చూడాలని, ఈ విషయాన్ని కౌన్సిల్ సభ్యులందరూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కొణతం చిన వెంకట్‌రెడ్డి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కాగా, బడ్జెట్‌ను సభ్యులందరు ఆమోదించారు. సమావేశం అనంతరం బదిలీపై వెళ్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లును పాలక మండలి ఘనంగా సత్కరించింది. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అలక సరిత, కౌన్సిలర్లు రణపంగ నాగయ్య, బైరెడ్డి జితేందర్‌రెడ్డి, కొదమగుండ్ల సరిత, కుంకు సులోచన, లలితభారత్, వేమూరి నాగవేణి, బాషా, షహనాజ్, మున్సిపల్ మేనేజర్ అశోక్‌రెడ్డి, మున్సిపల్ ఏఈ స్వాతి తదితరులు ఉన్నారు.

కోదాడ బడ్జెట్ రూ. 37.40 కోట్లు



బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న చైర్ పర్సన్, వైస్‌చైర్మన్, కమిషనర్

కోదాడ: పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి అనుగుణంగా బడ్జెట్‌ను రూపొందించినట్లు కోదాడ మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని ప్రమీల అన్నారు. గురువారం కోదాడ మున్సిపల్ కార్యాలయంలో కోదాడ పురపాలక సంఘం 2024–25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను అంచనా బడ్జెట్ వివరాలను తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అంచనా ఆదాయం రూ. 37.40 కోట్లుగా , వ్యయం రూ. 37. 40 కోట్లుగా ఉంటుందని అంచనా వేశామన్నారు. దీనిలో హరితహారానికి రూ.2.42 కోట్లు, అభివృద్ధి పనులకు రూ. 17.55 కోట్లు, పారిశుద్ధ్యానికి రూ. 2.68 కోట్లు, విద్యుత్ బిల్లుల చెల్లింపునకు రూ.95 లక్షలు, సిబ్బంది జీతభత్యాలకు రూ. 6.35 కోట్లతో అంచనాలను రూపొందించినట్లు వివరించారు. దీంతో పాటు 2023–24లో ఆదాయం రూ.36.30 కోట్లుగా, వ్యయం రూ.36.30 కోట్లుగా సవరించి ఆమోదించినట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ అంబటి రమాదేవి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల కళా ప్రదర్శన



సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

నేరేడుచర్ల : సకల కళల ఖజానా పినాకిల్ విద్యా సంస్థలు అని ఆ సంస్థల అధినేత ఎస్‌కె మధార్ అన్నారు. గురువారం నేరేడుచర్లలోని పినాకిల్ పాఠశాలలో చిన్నారులతో కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ చిన్నారులు దేశభక్తులు, జాతీయ నాయకులు, దేవతా మూర్తుల వేషధారణలో పలువురిని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో స్థానికులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ధర్మభిక్షం సేవలు మరువలేనివి



హుజూర్‌నగర్ : ధర్మభిక్షం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



చిలుకూరులో ధర్మభిక్షం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్‌ఐ రాంబాబు, నాయకులు

చిలుకూరు : గీత వృత్తిదారులకు ధర్మభిక్షం చేసిన సేవలు మరువలేనివని పలువురు నాయకులు అన్నారు. చిలుకూరు మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న గౌడ కులస్తుల కులదైవం కాటమయ్య ఆలయం ఆవరణలో గురువారం మాజీ ఎంపీ, గీత పనివారల సంఘం మాజీ జాతీయ అధ్యక్షుడు బొమ్మగాని ధర్మభిక్షం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ సురభి రాంబాబు, గీత పనివారల సంఘం రాష్ట్ర నాయకుడు కొండా కోటయ్య, గీత సంఘం, గౌడ సంఘం నాయకులు, సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మభిక్షంకు నివాళి

హుజూర్‌నగర్ : పట్టణంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం జయంతిని గీతపనివారల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గీత పనివారల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పాలకూరి బాబు, నాయకులు క్రిష్ణ, సైదులు, పాపులు, లింగయ్య, వెంకటేశ్వర్లు, వెంకటేష్, విజయ్, లక్ష్మమ్మ, యశోద, పిచ్చమ్మ, మల్లమ్మ, తిరపమ్మ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపాన్ని వినియోగించుకోవాలి



టీటీడీ కల్యాణ మండపంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కోదాడఅర్బన్ : టీటీడీ కల్యాణ మండపాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, కల్యాణ మండపంలో వివాహం చేసుకున్న నూతన దంపతులకు తిరుమల వేంకటేశ్వరుని ఆశీస్సులు అందుతాయని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. కోదాడ పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డులో ఉన్న టీటీడీ కల్యాణ మండపాన్ని ఆధునీకరించి ప్రత్యేక పూజలతో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండపం నిర్వాహకులు జగన్ ప్రసాద్‌తో పాటు పట్టణ ప్రముఖులు, మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు పైడిమర్రి వెంకటనారాయణ, పైడిమర్రి నారాయణరావు, పందిరి సత్యనారాయణ, గరిణే శ్రీధర్, వాసు, బాబు, మహిళలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల నిర్మాణానికి శంకుస్థాపన



మునగాల : నారాయణగూడెంలో సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ప్రత్యేక అధికారి

మునగాల : మండలంలో గురువారం ఎన్ఆర్ ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణాలకు ముమ్మరంగా శంకుస్థాపనలు చేశారు. నారాయణగూడెంలో గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి, తహసీల్దార్ ఆంజనేయులు రూ.10 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సారెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గోపిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు గురోజి, పంచాయతీ కార్యదర్శి రజిత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సీతానగరంలో..

మండలంలోని సీతానగరంలో గల ఎస్సీ కాలనీలో రూ.ఐదు లక్షల వ్యయంతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పల్లపు సతీష్, మాజీ సర్పంచ్ పుల్లూరి ఉపేందర్ శంకుస్థాపన చేశారు. కార్యదర్శి దేవరం శ్వేత, వార్డు సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

బరాఖత్‌గూడెంలో..

మండలంలోని బరాఖత్‌గూడెంలో గల పదవ వార్డులో రూ.పదిలక్షల వ్యయంతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ నాయకులు కాలే సామియేలు, ఓరుగంటి రవి, కరుణాకర్‌రెడ్డి, బొంతు వెంకటేశ్వరరావు, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపాలలో..

మండలంలోని రేపాలలో రూ.పదిలక్షల వ్యయంతో చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు వరికెల రమేష్ శంకుస్థాపన చేశారు. ఎంపీటీసీ సోంపంగు మోహన్, కాంగ్రెస్ నాయకులు మొగిలిచర్ల రాజేష్, జితేందర్, ప్రభంజన్‌రెడ్డి, అమృతారెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

ముకుందాపురంలో..

మండలంలోని ముకుందాపురం గ్రామంలో గురువారం రూ.పదిలక్షల వ్యయంతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు బోళ్ల వెంకటరెడ్డి, రెణబోతు సుమన్‌రెడ్డి, ముస్కుల సైదిరెడ్డి, నర్రా శ్రీనివాస రెడ్డి, నర్రా నవీన్‌రెడ్డి, పోరెడ్డి భూపాల్‌రెడ్డి, వీరారెడ్డి, బాబు, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన..

మండలంలోని తిమ్మారెడ్డిగూడెంలో ఎన్ఆర్ ఈజీఎస్ నిధులతో చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణానికి మాజీ సర్పంచ్ బి.శ్రీనివాసరెడ్డి, ఉపసర్పంచ్ అచ్చయ్య శంకుస్థాపన చేశారు. ఎంపీటీసీ సభ్యులు ఎర్రం శ్రీనివాసరెడ్డి, వార్డు సభ్యులు, నాయకులు వీరరాఘవరెడ్డి, సైదిరెడ్డి, పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన

కోదాడరూరల్ : మండలంలోని గణపవరంలో ఉపాధి హామీ నిధులు రూ.25 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు ఎంపీపీ మల్లెల రాణి, జెడ్పీటీసీ మందలపు కృష్ణకుమారి శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యదర్శి మునావర్, సుమన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఇర్ల అన్నపూర్ణసీతారాంరెడ్డి, చిట్టా రాంరెడ్డి, నారపరెడ్డి, సత్యం, ప్రసాద్ ఉన్నారు.